సంజీవయ్య సేవలు శ్లాఘనీయం

శ్రీకాకుళం అర్బన్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదర సంజీవయ్య చేసిన సేవలు శ్లాఘనీయమని సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి, జిల్లా ఖజానా అధికారి రవికుమార్ అన్నారు. సంజీవయ్య 104వ జయంతిని పురస్కరించుకుని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నగరంలోని సంజీవయ్య పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి బుధవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి లేని రాజకీయాలకు సంజీవయ్య చిరునామాగా నిలిచారన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాలకు ఆయన మార్గనిర్దేశకులని కొనియాడారు. విలువలకు కట్టుబడి బతికిన అతి కొద్దిమందిలో ఆయన ఒకరన్నారు. కార్యక్రమంలో దామోదర సంజీవయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కె.వేణు, ఎంఆర్‌పిఎస్ నాయకులు బోసు మన్మథరావు, తైక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని వేడుక నేడు

- అర్ధరాత్రి నుంచి రథసప్తమి వేడుకలు
- ముస్తాబైన అరసవల్లి ఆలయం
- విఐపి, వివిఐపి పాసులు రద్దు
- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు
- పోలీసు బందోబస్తు ఏర్పాటు

ప్రారంభం ఇలా...

ఈనెల 15న అర్ధరాత్రి 12.15 గంటల నుంచి 16న ఉదయం 7 గంటల వరకు క్షీరాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటల వరకు నిజరూప దర్శనం కల్పిస్తారు. ఈ వేడుకలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగు వారు సైతం తరలివస్తారు. ఏటా ఈ వేడుకల్లో వేల సంఖ్యలో యాత్రికులు స్వామివారిని సందర్శిస్తారని అంచనా.

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రథసప్తమి వేడుకకు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం ముస్తాబైంది. ఈరోజు అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆదిత్యునికి క్షీరాభిషేకం చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆదిత్యుని దర్శనానికి అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చే అవకాశముండడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఈ ఏడాది విఐపి, వివిఐపి ఉచిత పాసులను రద్దు చేశారు. వేడుకల సందర్భంగా శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉండకుండా ఆంక్షలు విధించారు.

ముస్తాబైన ఆలయం

రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి అరసవల్లి కూడలి వరకు ఆర్‌టిసి 20 బస్సులను నడపనుంది. మిల్లు జంక్షన్ నుంచి కాలినడకన అరసవల్లి ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన క్యూలైన్ల వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆలయ పరిసరాలు, 80 అడుగుల రోడ్డులో మొబైల్ మరుగుదొడ్లను సిద్ధం చేశారు. ఎప్పటికప్పుడు ఆలయ పరిసర ప్రాంతాల శుభ్రత కోసం నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేశారు. 20 చోట్ల వైద్య బృందాలను ఏర్పాటు చేయనున్నారు. 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నారు.

ఉచిత పాసులు రద్దు

ఈ ఏడాది వివిఐపి, విఐపి ఉచిత పాసులను రద్దు చేశారు. రూ.500 చెల్లిస్తే వారికి విఐపి టిక్కెట్లను జారీ చేస్తారు. టిక్కెట్లు కొనుగోలు చేసిన వివిఐపి, విఐపిలకు ఆలయ ప్రధాన ఆర్చి నుంచి క్యూలైన్ మొదలవుతుంది. నేరుగా ఆలయంలోకి ప్రవేశించి తిరిగి అదే క్యూలైన్ ద్వారానే బయటకు పంపిస్తారు. వీరితో పాటు క్షీరాభిషేకం టిక్కెట్లు కొనుగోలు చేసుకున్న వారికి, ఆలయ అభివృద్ధికి రూ.లక్షకు పైగా విరాళాలు అందించిన దాతల కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉచిత ప్రవేశం, రూ.100 టిక్కెట్టు కొనుగోలు చేసిన వారికి మాత్రం ఇంద్రపుష్కరిణి వైపు నుంచి ప్రవేశం కల్పించనున్నారు. వికలాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్స్ ఏర్పాటు చేస్తున్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

ఆలయం వద్ద కంట్రోల్ రూమ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదిత్యుని దర్శించుకునేందుకు వేలాది మంది రానుండడంతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. నాలుగు షిఫ్టుల్లో విశాఖ రేంజ్ పరిధిలోని ఉమ్మడి మూడు జిల్లాల నుంచి సుమారు 1200 మంది పోలీసులను వినియోగిస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వివిఐపిలు వచ్చే అవకాశం ఉండడం వల్ల వారి ప్రోటోకాల్ బాధ్యతలను రెవెన్యూ శాఖకు అప్పగించారు.

బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సేవలకు స్వచ్ఛంద సంస్థలు

అరసవల్లి వచ్చే యాత్రికులకు సేవలందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. మజ్జిగ, పులిహోరాతో పాటు మంచినీరు, భోజన సదుపాయాలకు ఏర్పాట్లు చేస్తున్నాయి. మిల్లు జంక్షన్ నుంచి అరసవల్లి తోట వరకు ఉన్న రోడ్డులో ఉన్న ప్రధాన మార్గాల్లో ఈ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలన

రథసప్తమి వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి జి.ఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. ఆలయ అర్చకులు, అధికారులతో కలిసి ఆలయ ప్రాంగణం, ఇంద్ర పుష్కరిణి, ఉచిత దర్శనంతో పాటు విఐపి, వివిఐపి దర్శన మార్గాలను పరిశీలించారు. దర్శనం కోసం వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. యాత్రికులకు అవసరమైన సమాచారాన్ని తెలిపేందుకు సాయపడేందుకు వీలుగా ప్రత్యేక పోలీసు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, దేవాదాయశాఖ ఆర్‌జెసి విజయ్‌కుమార్, సహాయ కమిషనర్ డి.వి.వి ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఇఒ రమేష్‌బాబు ఏర్పాట్లను వివరించారు.

మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ట్రాఫిక్ ఆంక్షలు

రథసప్తమి రద్దీ దృష్ట్యా శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నాలుగు రూట్‌లుగా విభజించి ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. ట్రాఫిక్ ఆంక్షలు ఈనెల 15వ తేదీ రాత్రి ఎనిమిది గంటల నుంచి మరుసటి రోజు రాత్రి 12 గంటల వరకు ఆంక్షలు అమలు కానున్నాయి.

రూట్ నెంబర్-1 : పెద్దపాడు నుంచి రామలక్ష్మణ మీదుగా నగరంలోకి వచ్చే వాహనదారులు సూర్యమహల్ నుంచి చిన్నబరాటం వీధి, పాతబస్టాండ్ కూడలి, జెడ్‌పి కార్యాలయం, సంతోషిమాత గుడి, వాంబే కాలనీ మీదుగా 80 అడుగుల రహదారిలో ఏర్పాటు చేసి పార్కు ప్రదేశానికి చేరుకుని వాహనాలు పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

రూట్ నెంబర్-2 : నవభారత్, బాలభారతి కూడలి నుంచి నగరంలోకి వచ్చే వాహనదారులు గుజరాతీపేట కూడలి, ఏడు రోడ్ల కూడలి, పందుంపుల్ల కూడలి, పాతబస్టాండ్, జెడ్‌పి కార్యాలయం, సంతోషిమాత గుడి, వాంబే కాలనీ మీదుగా 80 అడుగుల రహదారిలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశానికి చేరుకుని వాహనాలు పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

రూట్ నెంబర్-3 : కొత్తరోడ్డు, బలగ కూడలి మీదుగా వచ్చే వాహనదారులు ఆర్‌టిసి కాంప్లెక్స్, అంబేద్కర్ కూడలి, డే అండ్ నైట్, ఏడు రోడ్ల కూడలి, పందుంపుల్ల కూడలి, పాతబస్టాండ్, జెడ్‌పి కార్యాలయం, సంతోషిమాత గుడి, వాంబే కాలనీ మీదుగా 80 అడుగుల రహదారిలో వాహనాలు పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

రూట్ నెంబర్-4 : గార, శ్రీకూర్మం నుంచి వచ్చే వాహనాలు వాడాడ కూడలి వద్ద నిర్దేశించిన ప్రదేశంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

ప్రత్యామ్నాయ మార్గం : ఎన్‌హెచ్-16లో మునసబుపేట వద్ద సర్వీసు రోడ్డులోకి ప్రవేశించి శాస్త్రులపేట మీదుగా సానివాడ, ఒప్పంగి, వాడాడ జంక్షన్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడ పార్కింగ్ కేటాయించారు. అక్కడ్నుంచి ఉచిత లైన్‌కు చేరుకోవచ్చు.

పార్కింగ్ ప్రాంతం : దర్శనానికి వచ్చే సందర్శకులకు 80 అడుగుల రోడ్డు వద్ద పార్కింగ్ ప్రాంతం ఏర్పాటు చేశారు. దర్శన అనంతరం 80 అడుగుల రోడ్డు పార్కింగ్ నుంచి అరసవల్లి మిల్లు కూడలి, ఉమెన్స్ కాలేజ్, సూర్యమహల్, రామలక్ష్మణ కూడలి మీదుగా పెద్దపాడు వైపు వెళ్లాలి.

టెక్కలి : నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పలాస, టెక్కలి

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ ఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యాన ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. జెఎసి పిలుపులో భాగంగా పలాసలో ఎంపిడిఒ, ఎంఇఒ, సచివాలయాల వద్ద టెక్కలిలో సబ్ కలెక్టరేట్, తహాశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ 12వ పిఆర్‌సిలో 30శాతం ఫిట్‌మెంటు వెంటనే ప్రకటించాలని, సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ వారికి డిఎ బకాయిలు 90 శాతం నగదు రూపంలో చెల్లించాలన్నారు. 11వ పిఆర్‌సిలో ఇప్పటికీ ఎరియర్స్, సరెండర్ లీవ్ బకాయిలు, పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లయిమ్‌లు వెంటనే చెల్లించాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో ప్రవేశపెట్టిన అప్రెంటిషిప్‌ను రద్దు చేయడంతో పాటు ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు.

పలాస : వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు

గురుకులాలు, సొసైటీ లు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, గతంలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు సామాజిక భద్రత కింద కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు బోనెల గోపాల్, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.ఉపేంద్ర, జాయింట్ సెక్రటరీ ఉదయశంకర్ పాత్రో, ఉమెన్ వింగ్ సెక్రటరీ రోజా, జెఎసి నాయకులు సంపతిరావు, మోహనరావు, జి.రత్నకుమార్, నంద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన అవసరం

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఆయా రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 33వ వారపు సమావేశంలో భాగంగా ఇవిఎంలు, వివి ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లపై అవగాహన కల్పించేందుకు ఎన్నికల సంఘం ముద్రించిన ప్రత్యేక హ్యాండ్ బుక్‌ను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. పోలింగ్ నిర్వహణ మొదలు సాంకేతిక అంశాలు, ఆయా పరికరాల పూర్తి వివరాలు హ్యాండ్ బుక్‌లో ఉంటాయని తెలిపారు. వీటిలోని ప్రతి అంశాన్నీ తెలుసుకొని ఉండాలని కోరారు. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇసిఐ నిబంధనల మేరకు వీటిని ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఇవిఎంల సహాయంతో ఓటింగ్ ప్రక్రియ, వివి ప్యాట్‌లపై జిల్లావ్యాప్తంగా సంచార ప్రదర్శన వ్యాన్లతో జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. డెమో ఇవిఎంల ద్వారా స్వయంగా ఓటు వేసి తమ అనుమానాలను ఓటర్లు నివృత్తి చేసుకుంటారని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, కాంగ్రెస్ నాయకులు డి.మల్లిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, బిజెపి నాయకులు సురేష్‌బాబు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై నమ్మకం పోయింది

- అందుకే వైసిపిని వీడుతున్నారు
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వైసిపిని స్థాపించినప్పట్నుంచీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెనుక నడిచిన వారు, ఆయన జైలుకు వెళ్లినప్పుడు అండగా ఉన్న వారు ఇప్పుడు ఆయనపై నమ్మకం లేక ఆ పార్టీని వీడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సొంత తల్లి, చెల్లినే ఆదరించని వాడు రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండలంలోని చిన్నసాన వైసిపి ఎంపిటిసి నంబాళ్ల రాజశేఖర్, మాజీ సర్పంచ్ ఎండ నాగేశ్వరరావుతో పాటు చిన్నసాన, జీయన్నపేట పంచాయతీలకు చెందిన పలువురు బుధవారం టిడిపిలో చేరారు. వారికి అచ్చెన్నాయుడు కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌పై ఎంతో నమ్మకం పెట్టుకున్న ఆ పార్టీ నాయకులు ఆయన రాజకీయాలకు పనికిరాడని గ్రహించి టిడిపిలో చేరుతున్నారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి రాజధాని ఏది అంటే చెప్పలేని పరిస్థితి దాపురించిందన్నారు. మూడు రాజధానుల పేరుతో ఉత్తరాంధ్రలో సహజ సంపదను దోచుకున్నారని తెలిపారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. మరో మూడు నెలల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, ఈ ఇబ్బందులేవీ ఉండవన్నారు.

టెక్కలిలో వైసిపికి నాయకత్వమే లేదని, ఇక్కడ ఉన్న నాయకునికి టిడిపి నాయకులకు తిట్టడం తప్ప చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. టెక్కలి నియోజకవర్గం టిడిపిలోనే అభివృద్ధి చెందిందని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చాక టెక్కలి నియోజకవర్గాన్ని పారిశ్రామికవాడగా తయారు చేస్తానని హామీనిచ్చారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన పంచాయతీలో సాగునీరు లేక చాలా ఇబ్బందులు పడ్డారని, టిడిపి వచ్చాక లిఫ్ట్ ఇరిగేషన్ తెస్తామన్నారు. ఇప్పుడు ఎత్తిపోతల పథకాన్ని నడపలేని, చేతకాని నాయకులు అధికారంలో ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, బగాది శేషు, మాజీ ఎంపిపిలు టి.రామకృష్ణ, వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అధిగమించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. అతి వేగంతో ఆటోలు నడపవద్దని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని స్పష్టం చేశారు. ప్రయాణికులు ఎక్కడికి వెళ్లిందీ నమోదు చేసుకోవాలన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటనల సందర్భంలో ఈ వివరాలు ఉపయోగపడతాయని చెప్పారు. హైవేపై వెళ్లేటప్పుడు సర్వీసు రోడ్డును మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని చెప్పారు. ఆటో డ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రైవర్లు కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కంటి సమస్యలు ఉత్పన్నమైతే రాత్రి సమయాల్లో ఇబ్బంది మారి ప్రమాదాలకు కారణమవుతుందని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అలా చేస్తే డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రమాద రహిత ఆటో డ్రైవింగ్‌కు అనుసరించాల్సిన పద్ధతులపై ఎంవిఐలు అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స, అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ ఏవిధంగా చేయాలన్న దానిపై రెడ్‌క్రాస్ సభ్యులు అవగాహన కల్పించారు. అనంతరం కంటి వైద్య నిపుణులు పి.ఎల్.రాజు నేతృత్వాన ఆటోడ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డిఎస్‌పి వై.శృతి, ట్రాఫిక్ సిఐ అవతారం, ఎంవిఐలు గంగాధర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఈనెల 16న చేపడుతున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. బంద్ జయప్రదం కోరుతూ మండల కేంద్రంలో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో రైతాంగం చేసిన పోరాటం సందర్భంగా 2014లో స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చెల్లిస్తామన్న హామీని బిజెపి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర మొత్తం ఉత్పత్తి ఖర్చులు, కుటుంబ శ్రమ విలువపై 50 శాతం ఉండేలా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహా రుణ విమోచన చట్టం తీసుకురావాలని, అన్ని బ్యాంకింగ్ సంస్థల నుంచి ఒకేసారి రుణమాఫీ చేయాలన్నారు. విద్యుత్ సవరణ చట్టం ద్వారా విద్యుత్‌రంగ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికిందన్నారు. కాంట్రాక్టు కార్మిక వ్యవస్థను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దుప్పాడ బంగారాజు, బి.రాము, పి.రామారావు, జి.శ్రీనివాసరావు, ఎల్.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన చేపడుతున్న కార్మికులు

వ్యవసాయ యాంత్రీకరణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వ్యవసాయ యాంత్రీకరణతో అధిక దిగుబడిని సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ పి.వి.కె జగన్నాథరావు అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో 42వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరకు రకాలపై పరిశోధనా క్షేత్రాలు, నాణ్యమైన బెల్లం తయారీపై పలురకాల కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం కె.వి.కె కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 2023-24లో శాస్త్రవేత్తలు చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ 2024-25లో చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఆంగ్రు గుంటూరు విస్తరణ సంచాలకుల ప్రతినిధి డాక్టర్ బి.ముకుందరావు కృషి విజ్ఞాన కేంద్రం చేపట్టే కార్యక్రమాలను అభినందించారు. వ్యవసాయ యాంత్రీకరణలో, విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది చేస్తున్న కృషిని కొనియాడారు. జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో అపరాల సాగు, సమగ్ర యాజమాన్య పద్ధతులపై పలురకాల కార్యక్రమాలను చేపట్టాలని, కార్యక్రమ ప్రణాళికలో భాగంగా ప్రదర్శనా క్షేత్రాలను, పరిశీలన క్షేత్రాలను పొందుపర్చాలని శాస్త్రవేత్తలకు విన్నవించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ బావ మాట్లాడుతూ జీడిమామిడి, ఇతర ఉద్యానవన పంటల్లో సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులపై తెలిపారు. కార్యక్రమంలో ఆంగ్రు గుంటూరు వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి పి.వి సత్యనారాయణ, ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి భగవాన్, యలమంచిలి వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి బి.అప్పలస్వామి, ఆత్మా పీడీ రామచంద్రరావు, అనుబంధ రంగాల అధిపతులు, శాస్త్రీయ సలహా మండలి రైతు సభ్యులు, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.

పురపరిపాలనశాఖ
పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘం

షార్ట్ టెండరు నోటీసు

రేఖా నం. 38/2023/E1/BOQ No's 930-949 (1st call) తే.15/02/2024 దీ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో GGMP నిధులు, CMDF నిధులు మరియు సాధారణ నిధులతో చేపట్టు పనులకు. ఇ-ప్రొక్యూర్మెంటు ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

పనుల సంఖ్య: 20 అంచనా విలువ సుమారు రూ. 77.10 లక్షలు

Bid Document Download start Date & Time	- 15-02-2024	11.00 A.M
Bid Document Download End Date & Time	- 21-02-2024	03.00 P.M
Bid Submission Closing Date & Time	- 21-02-2024	03.30 P.M
Bid Document Open Date & Time	- 21-02-2024	04.30 P.M

మిగతా వివరములకు ఆఫీసు పనివేళలలో తెలుసుకొనవచ్చును మరియు అంతర్జాలములో https://tender.apeprocurement.gov.in

సం/- నాగేంద్ర కుమార్.టి,
కమీషనరు, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A.133/2023 in O.S.3/2021

Between:
1.Byreddy Balaram
2.Gantyada Vishnu Murthy
3.Kella Ganapathi Rao
4.Pisini Srinivasa Rao
5.Kalisetty Sandhya
6.Peddinti Lakshmi
Petitioners 1 to 6 are rep by their GPA holder K.Ravi Kumar ...Petitioners
And:
Dannana Rami Naidu, S/o Late Chinnam Naidu, Hindu, aged about 44 years, D.No.1-23, Dannana Veedhi, Bejjipurm village, Laveru Mandal, Srikakulam Dist. ...Respondent

Please take notice that the above named petitioner has filed the above I.A. for passing final decree for sale of the mortgaged properties for realization of decree amount in terms of the preliminary decree against you and the Hon'ble court was pleased to posted the case to **29.02.2024** for your appearance and answer the claim of the petitioners in the above matter before the Hon'ble court at **10.30 A.M.** on the said date and time to answar the same either in person or through counsel or else the matter will be heard and determinced in your absence as per law.

Srikakulam.
Date.15-02-2024

G.JANARDHANARAO
B.JAGADEESWARA RAO
ADVOCATES,
BALAGA,SRIKAKULAM,
PH:94405 78338.

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

బంద్ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి- పలాస

ఈ నెల 16న చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు ఎన్.గణపతి, సిహెచ్.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ-పలాసలోని ఆటో మోటార్ రంగ కార్మికులతో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో, మోటార్ రంగ కార్మికులకు ఉరి తాడు లాంటి సెక్షన్ 106(1), 106(2) కేంద్రం తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే ఆటో కార్మికులపై ఇన్సూరెన్స్ ప్రీమియంలు, చలానాలు, లైసెన్స్ ఫీజులు విపరీతంగా పెరిగి మోయలేని భారం పడుతుందన్నారు. ఈ చట్టం వల్ల కార్మికులు రోడ్డున పడతారని అన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కె.వెంకటరావు, తిరుపతి, లక్ష్మణరావు, అప్పలస్వామి, శాంతమూర్తి పాల్గొన్నారు. అలాగే మండలంలోని బొడ్డపాడులో గ్రామీణ సమ్మె పోస్టర్‌ను ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా కార్యదర్శి పి.దుర్యోధన, అధ్యక్షులు డి.నారాయణమూర్తి, ఎం.ధర్మారావు, పురుషోత్తం, డి.శ్రీరాములు, త్రిలోచనరావు, టి.అప్పారావు, బి.రామారావు. టి.క్రాంతి, బాలరాజు పాల్గొన్నారు.

జనసేనలోకి దానేటి శ్రీధర్

శ్రీధర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్

శ్రీకాకుళం : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సమక్షంలో జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్ బుధవారం చేరారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌ను కలిశారు. శ్రీధర్‌కు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. శ్రీధర్‌తో పాటు బొంపాడ నవీన్ కుమార్, కిల్లి జగన్మోహన్ ఉన్నారు. ఆయనకు ఎమ్మెల్యే టిక్కెట్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రైతు సంక్షేమమే ధ్యేయం

లావేరు : రైతు సంక్షేమమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలం తాళ్లవలస పంచాయతీ బొడ్డపాడులో లావేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గోదాంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు బురాడ చిన్నారావు, తాళ్లవలస ఉప సర్పంచ్ దేశెట్టి తిరుపతిరావు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతుంటే దానికి ఆ పార్టీకి చెందిన శాసనసభ్యులు తూట్లు పొడుస్తూ తూతూ మంత్రంగా కొనసాగిస్తూ అప్రతిష్ట పాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పురపాలక సంఘ పరిధిలో 6వ వార్డులో కాలింగమన్నయపేట, తెలగమన్నయ్యపేట, తురక పేట, కంచరానిపేట, సనపలవానిపేట, నందగిరిపేట, నాదనపురంలలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో ఆ వార్డు ప్రజలు తీవ్ర అసంతృప్తికి చెందారు. శాసనసభ ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గంలో అభ్యర్థులకు ఓట్లు వేస్తామని, ఆమదాలవలస మున్సిపల్ ఎన్నికల్లో ఒక ఓటు వేస్తామని కానీ తమను ఏ శాసనసభ్యుడు పట్టించుకోవడంలేదని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని వారు వాపోతున్నారు. బుధవారం జరిగిన గడపగడపకు కార్యక్రమంలో శాసనసభ్యులు ఎవరూ పాల్గొనక పోవడంతో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తూతూ మంత్రంగా పాల్గొని చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నందగిరిపేటలో సగం ఇళ్లకు మాత్రమే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిన ఫైళ్లను ఇచ్చారని అలాగే కె. మన్నయ్యపేటలో ఫైళ్లను గడపలో విసిరేసి వెళ్లిపోయారని అక్కడి ప్రజలు చెబుతున్నారు. నాదానపురం గ్రామానికి చెందిన పాతిన ఉషారాణి ఈ ఐదేళ్ల కాలంలో సంక్షేమ పథకాల వలన 7,40,668 రూపాయలు లబ్ధి చేకూరినట్లు ఫైల్‌ను వాలంటీర్లు ఆమెకు ఇచ్చారు. ఆ ఫైల్‌ను చూసిన ఆమె భర్త పాతిన వెంకటరమణ తమకు ఇంత లబ్ధి చేకూరలేదని సామాజిక మాధ్యమాలలో పోస్టును పెట్టి ఎవరైనా ఇంత లబ్ధి చేకూరిందని నిరూపిస్తే వారికి రూ.20 లక్షలు నగదును ఇస్తానని తెలిపారు. చివరకు 9:30 గంటల సమయంలో రెవెన్యూ శాఖ మంత్రి తనయుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు 6వ వార్డులో టి.మన్నయ్యపేటకు చేరుకొని మాజీ కౌన్సిలర్ చింతాడ వెంకటరమణ ఆధ్వర్యంలో కొంతమంది లబ్ధిదారులను కలిసి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి అక్కడ నుంచి వెనుతిరిగారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. రవి సుధాకర్, వైసిపి నాయకులు చిట్టి జనార్దనరావు, అంబటి శ్రీనివాసరావు, బోర చిన్నం నాయుడు, సనపల రాజు, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న రామ్‌మనోహర్ నాయుడు

సంత ఏర్పాటుకు చర్యలు

శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మెట్టూరు బిట్-3లో చిన్నయ్య ఆదివాసీ వికాస్ సంఘం, వంశధార రైతు ఉత్పత్తిదారుల సంఘం, నాబార్డు సహకారంతో సంత ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కేప్స్ డైరెక్టర్ పడాల లీషా, నాబార్డు అభివృద్ధి అధికారి కె.వరప్రసాద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సంత ఏర్పాటు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకోవడానికి, దళారీల బారిన పడకుండా రైతు సుస్థిరత కోసం రూరల్ హాట్ పేరుతో సంత ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మెట్టూరు బిట్-3తో పాటు చుట్టుపక్కల ఆరు కిలోమీటర్ పరిధి రైతులు, గిరిజనులు పండించే పంటలు నేరుగా మార్కెటింగ్ చేసుకోవడానికి, రైతులు ఉత్పత్తులు నిలవ చేసుకోవడానికి, మద్దతు ధర వచ్చేంత వరకు ఉంచి అమ్ముకోవడానికి, వ్యాపార సముదాయం, గోడౌన్ నిర్మాణం చేస్తున్నామని పేర్కొన్నారు. హార్టికల్చర్ శాఖ ద్వారా కోల్డ్ స్టోరేజ్, కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. మెట్టూరు బిట్-3ని దేశంలో ఒక మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. వంశధార ఎఫ్‌పిఒ ద్వారా ఈ ఏడాది ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైనవి, సరైన సమయంలో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోయిలపు శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ వావిలాపల్లి అనురాధ, మన్యదీపిక సిఇఒ కైలాష్ సాహు, సిఇఒలు డి.సుజాత, సవర తులసి, కో-ఆర్డినేటర్ తౌడు, ధర్మరాజు పాల్గొన్నారు.


లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

పొగమంచుతో అవస్థలు

ప్రజాశక్తి- పొందూరు

మండల పరిధిలో బుధవారం ఉదయం దట్టంగా కురిసిన పొగమంచుతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. సుమారు 8గంటల వరకూ దట్టంగా పొగమంచు కురవడంతో రహదారిపై రాకపోకలు సాగించేందు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుంటూ ప్రయాణాలు సాగించారు. ఈ ఏడాది మామిడి, జీడి పూత బాగా వచ్చిందని, కొద్ది రోజులుగా దట్టంగా పొగమంచు కురుస్తుండడంతో పూత రాలిపోతుందని, మంచి పూత వచ్చిందని ఆశపడ్డామని ఈ పొగమంచు కారణంగా చాలా నష్టపోవాల్సి వస్తుందంటూ రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అల్లెన హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ప్రతినిధి జడ్డ మహేశ్వరరావు విద్యార్థులకు వీటిని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చీమల లక్ష్మి, పింకీ రమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న మహేశ్వరరావు

ఎస్‌ఒజిఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణుల సంఘం (ఎస్‌ఒజిఎస్) నూతన అధ్యక్షునిగా డాక్టర్ ఊబ రామారావు ఎన్నికయ్యారు. నగరంలో వరం రెసిడెన్సీలో ఎస్‌ఒజిఎస్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా విశాఖపట్నంకు చెందిన హెచ్‌జిఎస్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్య నిపుణులు అండాశయ క్యాన్సర్, ఆధునిక చికిత్సా పద్ధతులపై కొనసాగుతున్న నిరంతర అధ్యయనంపై విశ్లేషించారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ ఊబ రామారావు, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ దానేటి శ్రీధర్, కార్యదర్శిగా డాక్టర్ బగ్గు సంధ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్ డి.పార్వతి, డాక్టర్ పి.రేవతి, డాక్టర్ ఎస్.శ్రీదేవి, కోశాధికారిగా డాక్టర్ ప్రశాంతి, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ సందీప్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్వర్ణలత, ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా డాక్టర్ ఆర్.అరవింద్‌తో పాటు మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. గతేడాది వందమంది సభ్యులతో ఏర్పాటు చేసిన శ్రీకాకుళం గైనకాలజిస్ట్ సంఘం జాతీయ స్థాయిలో గైనకాలజిస్ట్ ఫెడరేషన్‌కు అనుసంధించబడిందని పూర్వకార్యదర్శి ఎస్.శ్రీదేవి వివరించారు. గతేడాది ఆదాయ వ్యయాలతో కూడిన ఆర్థిక నివేదికను పూర్వ కోశాధికారి డా.ఎం.సందీప్ వివరించారు.

మాట్లాడుతున్న నూతన అధ్యక్షులు రామారావు

మాట్లాడుతున్న 'గుండ' దంపతులు

టిడిపితోనే సంక్షేమం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించడమే టిడిపి సిద్ధాంతమని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. అరసవల్లిలోని తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్.టి.రామారావు పేదలకు పింఛను, రూ.2 బియ్యం, పక్కా ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. ప్రస్తుత టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు కూడా కొనసాగించారని అన్నారు. యువగళం ద్వారా నారా లోకేష్ తన శక్తి సామర్థ్యాలను ప్రజలకు తెలిపి నాయకుడయ్యారని, ఇటీవల జిల్లాలో జరిగిన శంఖారావం ద్వారా తన నాయకత్వాన్ని మరోసారి నిరూపించుకున్నారని అన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

మాట్లాడుతున్న చిరంజీవి నాగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చంద్రబాబు వద్ద మెప్పు పొందడానికే స్పీకరు తమ్మినేని సీతారాం కుటుంబంపై టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ చేస్తున్న విమర్శలు అర్థరహితమని వైసిపి నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్ విమర్శించారు. వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆమదాలవలస నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిపైన చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నా నన్నారు. లోకేష్ ముందు ఢాంబికాలు పలకడానికే అవినీతి అంటూ మాట్లడడం సరికాదన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎవరు అవినీతిపరులో తెలుసన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యపట్ల బహిరంగ చర్చకు రావాలన్నారు. ఆమదాలవలసలో నిర్వహించిన శంఖారావం సభ జనాలు లేక వెలవెల బోయిందన్నారు. ప్రజలు ఎల్లప్పుడూ సీతారాంకు అండగానే ఉంటారన్నారు. సీతారాం, చిరంజీవి నాగ్ దౌర్జన్యాలు చేస్తున్నారని చెప్పడం సిగ్గుచేట న్నారు. శ్రీకాకుళం-ఆమదాలవలసకు పది కిలోమీటర్ల రోడ్డును వేయలేక పోయామని అంటున్నారని, ప్రస్తుతం రోడ్డుకు సంబంధించిన బిల్లులు సైతం చెల్లిస్తున్నారని, ఎన్నికలకు ముందే రోడ్డు నిర్మాణం పూర్తిచేసి చూపిస్తామన్నారు. ఆయన సొంత ఊరు పొందూరు మండలం పెనుబర్తిలో రోడ్డు వేసింది తమ్మినేని సీతారాం కాదా అని ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎం.వి. స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా సంజీవయ్య జయంతి

లావేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి సిఎం స్వర్గీయ దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా బుధవారం మురపాక శాఖగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి తలే రాంబాబు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్య బహుముఖ ప్రజ్ఞాశీలి, విలువలతో కూడిన మహా నాయకుడన్నారు. సిఎంగా, కేంద్రమంత్రిగా పనిచేసి సొంత ఇళ్లు లేకుండా నిస్వార్థంగా ప్రజాసేవకే అంకితమైన మహామనిషని కొనియాడారు. కార్యక్రమంలో షన్ముఖరావు, గోవింద, శ్రీను ఉన్నారు.

సరస్వతీదేవి విగ్రహాల ఆవిష్కరణ

కవిటి: మండలంలోని నెలవంక ఎంపిపి పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఆర్‌బికె చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం శివరాం ప్రసాద్ ఆర్థిక సాయంతో ఈ విగ్రహం ఏర్పాటు చేశారు.

సోంపేట: మండలంలోని పాలవలస ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన కర్రీ పాపారావు, రుక్మిణి దంపతులు సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాపారావు తండ్రి రామస్వామి జ్ఞాపకార్థం ఈ విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

మందులను పంపిణీ చేస్తున్న గణపతి

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామ సచివాలయం వద్ద బుధవారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆస్పత్రి వైద్యులు పూజిత, మణిదీపలు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పలువురిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది గోపి, చిన్నారావు, సర్పంచ్ ప్రతినిధి రామ్‌బుడ్డి గణపతి, టి.వాసుదేవరావు, టి.మోహనరావు, ఎస్.ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

'వారంతా టిడిపి నాయకులే'

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసాన పంచాయతీకి చెందిన పలువురు బుధవారం అచ్చెన్నాయుడు సమక్షంలో చేరిన వారంతా ఒకప్పుడు టిడిపి నాయకులేనని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని చిన్నసాన, జీయన్నపేట పంచాయతీలకు చెందిన ఈ వ్యక్తులు 2019 ఎన్నికల ముందు టిడిపిలోనే ఉన్నారని అన్నారు. ఇప్పుడు చేరిన వారంతా నిజమైన వైసిపి కార్యకర్తలు కారని అన్నారు. సమావేశంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, పేడాడ వెంకటరావు, బమ్మిడి గణపతిస్వామి, సింగుపురం వినోద్ ఉన్నారు.

గ్రోయిన్ పనులకు శంకుస్థాపన

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

సోంపేట : మండలంలోని పాలవలస సమీపంలో మహేంద్రతనయ నదిలో బారువ గ్రోయిన్ పనులకు మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.24.5 లక్షలు నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తయితే రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నిమ్మన దాసు, సర్పంచ్ ఎర్ర రజిని, నాయకులు జి.శ్రీను, ఎస్.భాస్కరరావు, బి.శ్రీకృష్ణ, ఎ.లోకనాథం, టి.పద్మావతి, ఎం.సునీత పాల్గొన్నారు.

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు

బహుమతులను అందజేస్తున్న గంగాధరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధరరావు తెలిపారు. బుధవారం ఆర్‌టిసి గ్యారేజీలో నిర్వహించిన రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు వేడుకల్లో ట్రాఫిక్ సిఐ అవతారంతో కలిసి పాల్గొన్నారు. రహదారిపై వాహనాలను ఏకాగ్రతతో నడపాలని, గతంలో జరిగిన ప్రమాదాల్లో నిర్లక్ష్యం వలనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. ట్రాఫిక్ సిఐ అవతారం మాట్లాడుతూ సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ఆల్కహాల్ సేవించి వాహనం నడపవద్దని సూచించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు ప్రతి సంవత్సరం చేయించుకోవాలని, మానసిక ఆనందం కలిగి ఉండాలని, యోగా చేయాలన్నారు. నెల రోజులు నిర్వహించిన భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్స్ డే, ఫ్యామిలీ కౌన్సిలింగ్ డే, వాహనాల మరమ్మతుల నిర్వహణ, స్వచ్ఛంద రక్తదాన శిబిరం, రక్షణాత్మక డ్రైవింగ్‌పై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి రహదారి నిబంధనలపై అవగాహన కలిగించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు డిపో మేనేజరు మల్లిఖార్జునరావు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రమాద రహిత రికార్డు కలిగిన ముగ్గురు డ్రైవర్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా నగదు, ప్రసంశాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాజు, పర్సనల్ ఆఫీసర్ పి.కృష్ణవేణి, నాలుగు డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు

27న 'చలో అసెంబ్లీ'

కొత్తూరు : సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నామని జెఎసి తాలూకా అధ్యక్షులు అల్లు తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు డిటి ఎన్.సత్యనారాయణను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.బాలరాజు, వెంకటరావు, రవి, అనంతకుమార్ ఉన్నారు.

విశ్వజ్యోతి విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : మంగళవారం విడుదల చేసిన జెఇఇ మెయిన్స్ పలితాల్లో టెక్కలి విశ్వజ్యోతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ దుప్పల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గిన్ని వెంకటేష్ (85), నవ్యశ్రీ (80), రంజిత (80) పాయింట్లు సాధించారని పేర్కొన్నారు. తమ కళాశాల నుంచి 13 మంది విద్యార్థులు హాజరు కాగా, ముగ్గురు ప్రతిభ కనబరిచారని తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపిపి బోర పుష్ప అధికారులకు సూచించారు. మండలంలోని శేశనంలో రూ.5 లక్షలు జెడ్‌పి నిధులతో సిసి రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ వస్తుందని, అందుకు పనులు వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కె.మోహనరావు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

ఇచ్ఛాపురం : స్థానిక స్వేచ్ఛా వతి ఆలయంలో స్థానిక స్వర్ణభారతి, సత్యసాయి విద్యాసంస్థలు బుధవారం సామూహిక అక్షరభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్వర్ణభారతి విద్యా సంస్థలు చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. క్రమశిక్షణతో బోధించే ఏకైక సంస్థ స్వర్ణభారతి విద్యా సంస్థ అని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుజాతరెడ్డి, గౌరీశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలోని మహర్షి విద్యానికేతన్ 186 మంది చిన్నారులు సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని యర్నాగులపేట కూడలి వద్ద ఉన్న అదిత్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల అవరణలో కరస్పాండెట్ చింటు రాజారావు, ప్రిన్సిపాల్ శిమ్మ అప్పన్న అధ్యక్షతన 200 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు మెండ రామినాయుడు, బొడ్డేపల్లి పాపారావు, రాళ్లపాటి నర్సింహామూర్తి, పట్ట మల్లేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే ఎంఇఒ సంపతిరావు అప్పలరాజు సామూహిక అక్షరాభ్యాసాన్ని పరిశీలించారు.

ఆమదాలవలస : మండలం రొట్టవలస కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పాఠశాలలో ఉన్న సరస్వతి దేవి విగ్రహం వద్ద కరస్పాండెంట్ బెవర హరి నారాయణ, ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి ఆధ్వర్యంలో కేరళ విద్యాలయ విద్యార్థులు సరస్వతి దేవికి పూజ నిర్వహించారు. అనంతరం పల గ్రామాలకు చెందిన తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకుని వచ్చి పాఠశాలలోని సరస్వతి దేవి విగ్రహం వద్ద అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇచ్ఛాపురం : పలకలు పంపిణీ చేస్తున్న తులసీదాస్‌రెడ్డి

శ్రీకాకుళం అర్బన్: నగరంలో బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సాయి ప్రియదర్శిణి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్వర్యాన నిర్వహిస్తున్న విశాఖ స్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాభ్యాసం కార్యక్రమంలో విశాఖస్కూల్‌లో ఉదయం 10 గంటలకు పాల్గొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ డా. కె.మధుసూధన్, హెచ్‌ఎం పి.రామారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సభాస్థలిని పరిశీలిస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

నేడు లావేరులో 'శంఖారావం'

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రమైన లావేరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం బహిరంగ సభ గురువారం మధ్యాహ్నం 4 గంటలకు ఎచ్చెర్ల టిడిపి ఇన్‌ఛార్జి కిమిడి కళావెంకటరావు అధ్యక్షతన జరుగనుంది. ఈ బహిరంగ సభకు లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాలకు చెందిన టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సన్నద్ధమవుతున్నారు. సభా ఏర్పాట్లును టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామమల్లిక్ నాయుడు, మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొరలు పర్యవేక్షిస్తున్నారు. బుధవారం సభాస్థలిని ఎస్‌ఐ సిహెచ్ స్వామినాయుడు సిబ్బందితో వచ్చి పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తదితర వాటిపై స్థానిక టిడిపి నేతలతో చర్చించారు.

'ఆడుదాం ఆంధ్రా'తో సాధించిందేంటి?

కృష్ణవాసుదేవరావు

ప్రజాశక్తి- పొందూరు

ఆడుదాం ఆంధ్రా కార్యాక్రమం ద్వారా వైసిపి ప్రభుత్వం ఏమి సాధించిందో చెప్పాలని ఆమదాలవలస నియోజకవర్గం టిడిపి బిసిసెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణవాసుదేవరావు అన్నారు. మండలం గోరింటలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా నాసిరకం క్రీడా సామాగ్రిని సరఫరా చేసి రూ.కోట్లు ఖర్చు పెట్టి పార్టీ ప్రచారంగా మార్చుకున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమిటని పేర్కొన్నారు. ఈ ఆటలు పేరుతో ప్రజాధనాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. ఈ క్రీడల ద్వారా ఎంతమంది ప్రతిభావంతులను ఎంపిక చేసారన్నది తెలపాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి ఆటలు నేర్పి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో ఎంపికలు చేసి ప్రతిభావంతులను తయారుచేయాలన్నారు. సుమారు 47 రోజులు పాటు అధికారులను, ఉపాధ్యాయులను ఇబ్బందికి గురి చేయడం తప్ప మరొకటి కాదన్నారు.

ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

సైన్స్ ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

టెక్కలి : మే నెల 22 నుంచి 26 వరకు లాస్ ఏంజిల్స్ కాలిఫోర్నియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ సమ్మేళనంలో ప్రదర్శించనున్న సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు టెక్కలి రవీంద్ర భారతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా నాసాలో జరిగే సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శనకు తమ విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ ఏడాది ద్విత్య ఆయుర్, కృత్రిమ, పృథ్వీ, ఆకాష్, జుమ్ను, ఫోనిక్స్ వంటి 14 ప్రాజెక్టులతో తమ విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు అభినందించారు.

నరికి ముక్కలుగా వేసిన భారీ వృక్షాలు

భారీ వృక్షాలు మాయం

బూర్జ: పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న భారీ వృక్షాలు మాయమవుతున్నాయి. బూర్జ మండల పరిధిలో ఉన్న తుడ్డలి, మర్రిపాడు, డొంకలపర్త గ్రామాల సమీపంలో ఉన్న భారీవృక్షాలు రాత్రికి రాత్రి మాయం చేస్తున్నారు. దోచుకునేందుకు కాదేది అనర్హం అన్న చందంగా భారీ చెట్లను సైతం నరికేసి తరలించుకుపోతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీస్ యంత్రాంగంతో పాటు సంబంధిత అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. భారీ వృక్షాలను నరికేసి దోచుకుపోతున్నా అధికారులు పట్టించుకోకవడం పట్ల మండల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రక్తదానం చేస్తున్న యువకుడు

26 మంది రక్తదానం

పలాస : రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని డాక్టర్ చింతాడ సుధీర్ అన్నారు. పుల్వామా దాడిలో అసువులు బాసిన అమరవీరులకు నివాళి అర్పిస్తూ ఆ నలుగురు ట్రస్టు ఆధ్వర్యాన ప్రాణదాత బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 26 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ నలుగురు ట్రస్టు సభ్యులు ఎప్పటికప్పుడు రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆ నలుగురు ట్రస్టు సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాజు, ఢిల్లీరావు, టి.భాగ్యలక్ష్మి, శివారెడ్డి పాల్గొన్నారు.

బోరు పనులకు శంకుస్థాపన

మెళియాపుట్టి : మండలంలోని బాణాపురం పంచాయతీ సవరగుమడలో తాగునీటి బోరు పనులకు సర్పంచ్ పెద్దింటి చంద్రరావు బుధవారం శంకుస్థాపన చేశారు. దీంతో గ్రామస్తులకు తాగునీటి కష్టాలు తీరుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బమ్మిడి కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్ చంద్రరావు